# తెలంగాణ తెచ్చిన కేసీఆరే లోకల్

కామారెడ్డిలో రేవంత్‌రెడ్డికి మూడో స్థానమే • దోచిన సొమ్ముతో లీడర్లను కొంటున్నడు • తల నరుక్కుంటాం కానీ.. ఢిల్లీకి తలవంచం • బీఆర్ఎస్ గొంతు నొక్కేందుకు మోదీ-షా యత్నం

బీజేపీని, మోదీని ఢీకొట్టే దమ్ము కేసీఆర్‌కే ఉంది • గోషామహల్‌ను దత్తత తీసుకొని అభివృద్ధి చేసి చూపిస్తా • రాజాసింగ్‌కు పంచాయితీలే తప్ప, ప్రజా సమస్యలు పట్టవు: కేటీఆర్



శనివారం కామారెడ్డి నియోజకవర్గం భిక్కనూర్‌లో నిర్వహించిన రోడ్‌షోలో భారీగా హాజరైన ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు

హైదరాబాద్ సిటీబ్యూరో/నిజామాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ ఖలీల్‌వాడీ: కామారెడ్డికి కేసీఆర్ వస్తున్నారంటే కలిసి వచ్చే కాలానికి నడిచొచ్చే కొడుకు వచ్చినట్టు అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. భూములు గుంజుకునేందుకు కేసీఆర్ వస్తున్నడు అంటూ కాంగ్రెస్ నేత అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 70 ఏండ్ల వయసులో కామారెడ్డిలో పేద రైతు భూమి గుంజుకునే ఆలోచన కేసీఆర్‌కు ఎందుకుంటుందని ప్రశ్నించారు. కాంగ్రెసోళ్లు అడ్డం పొడుగు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎకరం కాదు. గుంట కాదు. గజం కాదు. ఇంచు భూమి కూడా ఎవ్వరిదీ పోదు అని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీపోళ్లు పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని, వాళ్ల గురించి పట్టించుకోవద్దని సూచించారు. కేసీఆర్ రాకతో ఇక్కడి ప్రజలకు ఉల్టా లాభం జరుగుతుందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే బీజేపీకే లాభమని చెప్పారు. శనివారం హైదరాబాద్, కామారెడ్డి నియోజకవర్గం భిక్కనూర్‌లో, నిజామాబాద్ నగరంలో నిర్వహించిన రోడ్‌షోలలో మంత్రి కేటీఆర్ మాట్లాడారు. చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన నాయకుడు.. మీ దయతో, ప్రేమతో, ఆశీర్వాదంతో రెండు సార్లు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని నడుపుతున్నారని తెలిపారు. విజయవంతంగా తెలంగాణను అగ్రభాగాన నిలిపారని పేర్కొన్నారు. కామారెడ్డిలో కేసీఆర్‌ను నాన్ లోకల్ అంటున్న బీజేపీ అభ్యర్థే నాన్ లోకల్ అని చెప్పారు. ఎల్లారెడ్డికి చెందినోడు తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను నాన్ లోకల్ అంటున్నారని, కేసీఆర్ తెలంగాణ అంతటా

> కొడంగల్‌లో చెల్లని రూపాయి కామారెడ్డిలో చెల్లుతుందా? కొడంగల్‌లో అమ్ముడుపోని ఎద్దు కామారెడ్డి అమ్ముడుపోతుందా? బాగా బలిసిన కోడి.. చికెన్ సెంటర్ ముందుకు వచ్చి తొడ కొట్టినట్టు కామారెడ్డికి వచ్చి కేసీఆర్‌పై రేవంత్ పోటీ చేస్తున్నారు. ఆయనకు మూడో స్థానం తథ్యం.
>
> \- మంత్రి కేటీఆర్

> కేసీఆర్ రాకతో కామారెడ్డి దశ మారుతుంది. ఐదేండ్లలో దేశంలోనే నంబర్ వన్ నియోజకవర్గంగా కామారెడ్డి నిలుస్తుంది.
>
> \- మంత్రి కేటీఆర్

లోకల్ అని స్పష్టంచేశారు. కేసీఆర్ అమ్మగారిది ఇక్కడే కోనాపూర్ అని తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన కేసీఆర్ లోకల్ కాదా? అని ప్రశ్నించారు. బీజేపీ అభ్యర్థి తీరు దొంగే దొంగ దొంగ అన్నట్టు ఉన్నదని ఎద్దేవా చేశారు.

### ఏడాదిలోగా గోదావరి నీళ్లు..

ఏడాదిలోనే గోదావరి నీళ్లతో కామారెడ్డి నియోజకవర్గ ప్రజల కాళ్లు కడుగుతామని కేటీఆర్ చెప్పారు. ప్రత్యేక ప్యాకేజీతో గల్ఫ్‌లో ఉంటున్న వారిని ఆదుకుంటామని, గల్ఫ్ బాధితులకు బీమాను ఇప్పటికే కేసీఆర్ ప్రకటించారని వివరించారు. సౌభాగ్యలక్ష్మి పేరిట 18 ఏండ్లు నిండిన మహిళలకు నెలకు రూ.3 వేలు అందిస్తామని వెల్లడించారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా బీడీ కార్మికులకు పింఛన్లు ఇస్తున్నామని గుర్తుచేశారు. బీడీ కార్మికులకు కటాఫ్ పెంచాలని అంటున్నారని, జనవరిలో కటాఫ్ పెంచి ప్రతి ఒక్కరికీ పింఛన్ ఇచ్చే బాధ్యత తనదని హామీ ఇచ్చారు. అసైన్డ్ భూములుంటే వారికి డిసెంబర్ 3 తర్వాత అసైన్డు భూములున్న వారికి పట్టాలిచ్చి హక్కులు కల్పిస్తామని చెప్పారు. ఆ భూమిపై పూర్తి అధికారం ఉంటుందని, అమ్ముకోవచ్చు, బ్యాంకులో పెట్టుకోవచ్చు అని వివరించారు. ఈ ఎన్నికల్లో ఎట్లాగో గెలిచేది కేసీఆరే అని, తప్పకుండా ప్రజలంతా గెలిపిస్తారని పేర్కొన్నారు. 2014 సాధారణ ఎన్నికల్లో సిలిండర్ చూసి ఓటెయ్యాలని ప్రజలకు పిలుపునిచ్చిన మోదీ.. అదే సిలిండర్ ధరను రూ.800 పెంచి రూ.1,200 చేశారని మండిపడ్డారు. మోదీ హయాంలో కట్టెల పొయ్యిలే దిక్కు అయ్యాయని చెప్పారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.400కే సిలిండర్ అందిస్తుందని, మిగిలిన రూ.800 భారాన్ని కేసీఆరే భరిస్తారని చెప్పారు. జనవరిలో కొత్త రేషన్ కార్డులు వస్తాయని ప్రకటించారు. తెల్ల రేషన్ కార్డుదారులకు అన్నపూర్ణ పథకం కింద సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. రైతు బీమా మాదిరిగా కేసీఆర్ బీమా పథకం ద్వారా తెల్ల రేషన్ కార్డుదారులకు భూమి ఉన్నా, లేకున్నా రూ.5 లక్షల జీవిత బీమా అందించబోతున్నట్టు వెల్లడించారు.

### రాహుల్, మోదీ ప్లాన్ ఒక్కటే..

కేసీఆర్‌ను తెలంగాణలో గెలిస్తే లోక్‌సభ ఎన్నికల్లో ఢిల్లీలో జెండా పాతుతారనే భయంతో రాహుల్, మోదీలు ఇక్కడ కుట్రలు చేస్తున్నారని కేటీఆర్ వెల్లడించారు. మోదీ, యోగి, 15 మంది కేంద్ర మంత్రులు, బీజేపీ అధ్యక్షులు, రాహుల్, డీకే ఇంత మంది వస్తున్నారంటే వాళ్ల భయం ఒక్కటేనని పేర్కొన్నారు. 3వ సారి గెలిస్తే ఢిల్లీ వస్తాడు.. జెండా పాతుతాడు అని భయం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు పట్టుకున్నదని వివరించారు. బీఆర్ఎస్ పార్టీని, సీఎం కేసీఆర్ గొంతును నొక్కాలని మోదీ-షా చూస్తున్నారని మండిపడ్డారు. కానీ తాము వారికి భయపడబోమని స్పష్టం చేశారు. అవసరమైతే తల నరుక్కుంటాం కానీ ఢిల్లీ వాళ్లకు తలవంచమని స్పష్టం చేశారు. బీజేపీని, మోదీని ఢీకొట్టే దమ్ము కేవలం సీఎం కేసీఆర్‌కు, బీఆర్ఎస్ పార్టీకి మాత్రమే ఉన్నదని చెప్పారు.

> గోషామహల్ నియోజకవర్గాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి పథంలోకి తీసుకొస్తా. తొమ్మిదిన్నరేండ్లలో ఎమ్మెల్యే రాజాసింగ్ నియోజకవర్గానికి చేసింది ఏమి లేదు. ప్రజా సమస్యలపై ఆయనకు ఆసక్తి లేదు. బేకార్ ముచ్చట్లు.. పంచాయితీ పెట్టడమే రాజాసింగ్‌కు అలవాటు.
>
> \- మంత్రి కేటీఆర్

### తెలంగాణకు సింహం లాంటోడు కేసీఆర్

తెలంగాణకు సింహం లాంటి వ్యక్తి సీఎం కేసీఆర్ అని మంత్రి కేటీఆర్ పేర్కొన్నారు. ఒక్క కేసీఆర్ గొంతు నొక్కేందుకు ప్రధాని, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సిద్ధరామయ్య, డీకే శివకుమార్ లాంటి వారు వస్తున్నారని, గుంపులు, గుంపులుగా ఎంత

> రాహుల్‌గాంధీ వచ్చి మైనార్టీలు పేదవాళ్లు అంటున్నారు. 55 ఏండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశారు? 11 సార్లు రాష్ట్రంలో కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే మైనార్టీలకు ధోకా చేశారు.
>
> \- మంత్రి కేటీఆర్

మంది వచ్చినా తెలంగాణ రాష్ట్ర ప్రజలే తమకు బలమని వెల్లడించారు. సింహం లాంటి సీఎం కేసీఆర్ ఉండగా.. సీల్డ్ కవర్‌లో వచ్చే సీఎంలు మనకు ఎందుకు అని ప్రశ్నించారు. తొమ్మిదిన్నరేండ్లలో ఎలాంటి కరువు, కర్ఫ్యూ లేకుండా పాలన సాగించామని, అభివృద్ధి మీ కండ్ల ముందే ఉన్నదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ హయాంలో మూడు రోజులకోకసారి కర్ఫ్యూలు, బంద్‌లు ఉండేవని గుర్తు చేశారు.

### కామారెడ్డిలో చెల్లని రూపాయి నిజామాబాద్‌లో చెల్లుతుందా?

కామారెడ్డిలో చెల్లని రూపాయి నిజామాబాద్‌లో చెల్లుతుందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పొరపాటున షబ్బీర్ అలీ గెలిస్తే.. ఆయనతో పని పడితే ఎక్కడికి వెళ్లాల్సి ఉంటుందో ఆలోచించుకోవాలని సూచించారు. గణేశ్‌గుప్తాను మరోసారి ఆశీర్వదించాలని, ఆయన ఎప్పుడూ అందుబాటులో ఉంటారని చెప్పారు. గణేశ్ బిగాల చేసిన అభివృద్ధి కండ్ల ముందే ఉన్నదని, అభివృద్ధిని చూసి గణేశ్ బిగాలను గెలిపిస్తే నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్తారని వెల్లడించారు.

### గోషామహల్‌ను అభివృద్ధి చేస్తా

హైదరాబాద్ ప్రశాంతతను ఎవరూ చెడగొట్టాలని ప్రయత్నించినా ఊరుకోలేదని, రాజాసింగ్‌ను సైతం జైల్లో పెట్టించిన నాయకుడు కేసీఆర్ అని కేటీఆర్ తెలిపారు. సీఎం కేసీఆర్‌ను మించిన హిందువు ఎవరూ లేరని, యాదాద్రి ఆలయాన్ని నిర్మించారని వివరించారు. అభివృద్ధికి దూరంగా ఉన్న గోషామహల్‌ను అన్ని విధాలా అభివృద్ధి బాధ్యత తనదేనని, బీఆర్ఎస్ అభ్యర్థి నందకిశోర్ వ్యాస్‌ను గెలిపిస్తే ఐదేండ్లలో నియోజకవర్గానికి సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ధూల్‌పేటలో చాలా మంది కళాకారులు ఉన్నారని, గణేశ్, దుర్గామాత విగ్రహాలు తయారు చేసే 200 మంది కార్మికులకు అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ అందిస్తామని చెప్పారు. మలక్‌పేటలో టీవీ టవర్‌ను మరిపించేలా ఐటీ టవర్‌ను తీసుకువస్తామని, ఎంజీబీఎస్ నుంచి పాతబస్తీ వరకు మెట్రోను పూర్తి చేస్తామని వెల్లడించారు. నాగోల్ నుంచి పెద్ద అంబర్‌పేట వరకు మెట్రోను విస్తరిస్తామని చెప్పారు. ఆయా రోడ్ షోలలో ఎమ్మెల్యే గంప గోవర్ధన్, ఎంపీ బీబీ పాటిల్, అభ్యర్థులు బిగాల గణేశ్ గుప్తా, తీగల అజిత్‌రెడ్డి, నందకిశోర్ వ్యాస్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా, బీఆర్ఎస్ హైదరాబాద్ ఇంచార్జి దాసోజు శ్రవణ్, సీనియర్ నేతలు తీగల కృష్ణారెడ్డి, మోతె శోభన్ రెడ్డి, చలపతిరావు, ఆర్వీ మహేందర్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యమానికి పురుడు పోసిన గడ్డ ఇది

**రేవంత్‌రెడ్డి** భిక్కనూర్‌కు వచ్చి కేసీఆర్‌ను బూతులు తిట్టుడు.. నోటికొచ్చినట్టు ఒర్రుడు తప్ప చేసేది ఏమీ లేదని దుయ్యబట్టారు. పైసలిచ్చి కొనుడు అలవాటైన వ్యక్తి రూ.50 లక్షల డబ్బు సంచులతో దొరికిన దొంగ రేవంత్ అని మండిపడ్డారు. సర్పంచ్‌లు, జడ్పీటీసీలను కొన్నంత మాత్రాన ఓటర్ల మనసులను కొనలేరని స్పష్టంచేశారు. బిడ్డా యాదికి పెట్టుకో.. ఉద్యమానికి పురుడు పోసిన గడ్డ.. ఏకగ్రీవాలతో బీఆర్ఎస్‌కు పురుడు పోసిన గడ్డ కామారెడ్డి అని చెప్పారు. వ్యవసాయానికి 3 గంటలు విద్యుత్తు అంటున్న రేవంత్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. రైతుబంధు వృథా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ధరణి ఎత్తేసి పట్వారీ వ్యవస్థ తెస్తామని భట్టి విక్రమార్క చెప్తున్నారని వివరించారు. ఒక్క చాన్స్ అంటున్న కాంగ్రెస్‌కు 11 చాన్సులు ఇచ్చామని, మళ్లా ఆ దరిద్రం రావాల్నా అంటూ ప్రజలను ప్రశ్నించగా వద్దంటూ బదులిచ్చారు.

## ఉద్యమం చేశావా? ఉద్యోగం చేశావా?

**పోటీ పరీక్షలు రాసినవా? ఇంటర్వ్యూకు పోయినవా?**

**రాహుల్‌కు యువత ఆశలు, ఆకాంక్షలు తెలుసా?**

కాంగ్రెస్ హయాంలో ఏడాదికి 1,012 ఉద్యోగాలు

బీఆర్ఎస్ హయాంలో ఏటా 16,850 ఉద్యోగాలు

తెలంగాణ కంటే ఎక్కువ ఉద్యోగాలిచ్చిన రాష్ట్రం ఏదైనా ఉందా?

రాహుల్‌గాంధీకి మంత్రి కే తారకరామారావు సూటి ప్రశ్నలు

**తెలంగాణ రాష్ట్రంలో తొమ్మిదిన్నర ఏండ్లలో 2,02,735 ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చి, 1,60,083 నియామకాలను పూర్తిచేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారకరామారావు స్పష్టంచేశారు. కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ ఈ లెక్క తప్పు అని నిరూపించగలరా అని శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. తెలంగాణ కంటే ఎక్కువ ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించిన రాష్ట్రం దేశంలో ఏదైనా ఉందా? అని నిలదీశారు.**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారం వెలగబెట్టిన పదేండ్లలో (2004-14) తెలంగాణలో భర్తీ చేసిన ఉద్యోగాలు ఎన్ని? కేవలం 10,116 మాత్రమేనని, ఇదేనా నిరుద్యోగులపై మీ ప్రేమ అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఏడాదికి సగటున నింపిన సర్కారు కొలువులు 16,850 అని, కాంగ్రెస్ హయాంలో (2004-14) ఏటా ఇచ్చింది కేవలం 1,012 ఉద్యోగాలు మాత్రమేనని వివరించారు. ఇదీ కాంగ్రెస్‌కు బీఆర్ఎస్‌కు ఉన్న తేడా! మీరొచ్చి మాకు సుద్దులు చెబితే ఎట్లా? అని రాహుల్‌గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. జీవితంలో ఎప్పుడైనా ఉద్యమం చేశావా? ఉద్యోగం చేశావా? యువత ఆశలు, ఆకాంక్షలు తెలుసా? పోటీ పరీక్షలు రాసినవా? ఇంటర్వ్యూకు వెళ్లినవా? ఉద్యోగార్థుల ఇబ్బందులు ఏమన్నా నీకు అర్థమైతయా? రాహుల్ అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు.

- *95 శాతం ఉద్యోగాలు స్థానిక బిడ్డలకే దక్కేలా కొత్త జోనల్ వ్యవస్థను తీసుకొచ్చిన నిబద్ధత మాది! మా కొలువులు మాకే దక్కాలన్న ఉద్యమ స్ఫూర్తిని నిలబెట్టి నియామకాల నినాదాన్ని నిజం చేసిన వాస్తవాన్ని కాదనగలరా?*
- *1972లో సుప్రీంకోర్టు ముల్కీ నిబంధలను సమర్థిస్తూ తీర్పు ఇస్తే.. పార్లమెంట్‌లో చట్టంచేసి ముల్కీ రూల్స్‌ను రద్దుచేసి.. తెలంగాణ స్థానికత హక్కులకు సమాధికట్టింది మీ కాంగ్రెస్ పార్టీ కాదా?*
- *ఆరు సూత్రాలు.. 610 జీవోలు.. గిర్‌గ్లానీ నివేదికలు తుంగలో తొక్కి.. హైదరాబాద్‌ను ఫ్రీ జోన్‌గా మార్చేసి.. నాన్ లోకల్ కోటాలు పెట్టి.. తెలంగాణ యువతకు దక్కాల్సిన కొలువులను కొల్లగొట్టి తీరని అన్యాయం చేసిన ద్రోహులు మీరు కాదా?*
- *మీ పనికిమాలిన పాలనలో ఉపాధి లేక.. ఉద్యోగాల్లేక నిరాశతో తెలంగాణ యువత తుపాకులు చేతబట్టి అడవిబాటపట్టి నక్సలైట్లలో చేరింది నిజమా? కాదా?*
- *వేలమంది యువకులను పిట్టలను కాల్చినట్టు కాల్చి చంపి.. ఎన్‌కౌంటర్ల పేరుతో నిత్యం నెత్తుటేర్లు పారించిన కర్కశ పాలన మీది కాదా?*
- *మీ కాలంలో ఏపీపీఎస్సీ అక్రమాలకు అడ్డాగా మారి.. అంగట్లో బేరంపెట్టి కొలువులను అమ్ముకోలేదా? ప్రాంతీయ వివక్షతో.. ఇంటర్వ్యూల ముసుగులో తెలంగాణ యువతకు ఉద్యోగాలు రాకుండా చేసింది నిజం కాదా?*
- *1952లో నాన్ ముల్కీ గోబ్యాక్.. ఇండ్లీ సాంబార్ గో బ్యాక్ అని నినదించిన విద్యార్థులపై తూటాలు పేల్చి.. ఏడుగురు తెలంగాణ ముద్దు బిడ్డలను చంపిన దుర్మార్గులు.. దోషులు మీరు కాదా?*
- *1969లో జై తెలంగాణ అని నినదించిన 369 మంది యువకిశోరాల గుండెల్లో తుపాకిగుండ్లు దించి పొట్టనపెట్టుకున్న నరహంతకులు మీరు కాదా?*
- *2004లో తెలంగాణకు ఇచ్చిన మాట తప్పి.. పదేండ్లు కాలయాపన చేసి వందల మంది యువతీయువకుల ఆత్మబలిదానాలకు కారణం మీరు కాదా? సోనియగాంధీ బలిదేవత అని మీ పీసీసీ ప్రెసిడెంటే చెప్పింది అబద్ధమా?*
- *కర్ణాటకలో 100 రోజుల్లో 2.50 లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామన్న మీ ప్రగల్భాలు ఏమయ్యాయి? ఆరు నెలల్లో ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారో చెపుతారా? వాగ్దానం చేసి యువతను వంచించలేదా?*
- *కాంగ్రెస్ రాజ్యమేలుతున్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఉద్యోగాల భర్తీ హామీని మరిచి.. నిరుద్యోగులను నిండా ముంచింది నిజం కాదా? మీరు ప్రకటించిన పసలేని జాబ్ క్యాలెండర్ ఒక పచ్చి మోసం కాదా? ఎన్నికల కోడ్ అమలులో ఉండే 2024 మార్చి.. ఏప్రిల్.. మే నెలల్లో ఉద్యోగ నోటిఫికేషన్లు ఎలా సాధ్యం? యువతను మభ్యపెట్టి నాలుగు ఓట్లు వేయించుకునే నాటకం తప్ప చిత్తశుద్ధి ఏమైనా కనిపిస్తున్నదా? అని రాహుల్‌ను ఉద్దేశించి కేటీఆర్ ప్రశ్నలు సంధించారు.*

# పోస్టల్ స్టాంపునకూ నోచుకోని పీవీ

**ఢిల్లీలో పీవీఘాట్ నిర్మించలేకపోయారు • పార్లమెంటులో ఫొటో కూడా పెట్టలేదు**

**కాంగ్రెస్ నేతలా పీవీ గురించి మాట్లాడేది? • పీవీకి నివాళులు అర్పించింది బీఆర్ఎస్సే • మీడియాతో ఎమ్మెల్సీ వాణీదేవి**



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వాణీదేవి. చిత్రంలో మేయర్ విజయలక్ష్మి

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అన్నేండ్ల పాలనలో దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారత రత్న ఇవ్వకపోగా, ఆయన ఫొటోతో కనీసం పోస్టల్ స్టాంపు కూడా విడుదల చేయలేని నాయకులు తెలంగాణకు వచ్చి ఆయన పేరు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందని పీవీ తనయ, ఎమ్మెల్సీ వాణీదేవి ఆగ్రహం వ్యక్తంచేశారు. శనివారం ఆమె తెలంగాణభవన్‌లో మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో కలిసి మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ఆయన జీవించి ఉన్నప్పుడు కానీ, చనిపోయిన తర్వాత కానీ గుర్తింపునకు నోచుకోలేకపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో ఎంతోమంది ప్రధానులకు ఘాట్‌లు ఉంటే పీవీకి మాత్రం ఘాట్ కాదు కదా, పార్లమెంటులో ఆయన చిత్రపటాన్ని కూడా పెట్టలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు నేటికీ ఆయన సేవలను గుర్తించలేకపోయారని విచారం వ్యక్తంచేశారు. తెలంగాణ ఎన్నికల వేళ ఆయన పేరు చెప్పుకుని రాజకీయం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. సత్యసాయిబాబా వంటి వారే తన తండ్రిని 'సేవియర్ ఆఫ్ ఇండియా' అని అభివర్ణించారని గుర్తు చేశారు. పీవీ చివరి వరకు కాంగ్రెస్‌నే నమ్ముకుంటే ఆ పార్టీ మాత్రం ఆయన పేరున కనీసం పోస్టల్ స్టాంపుతో కూడా నివాళి అర్పించలేకపోయిందని విమర్శించారు.

### బీఆర్ఎస్ ద్వారానే పీవీకి నివాళి


బీఆర్ఎస్ ప్రభుత్వం మొదటి నుంచి పీవీ సేవలను గుర్తించిందని వాణీదేవి పేర్కొన్నారు. హైదరాబాద్ నడిగడ్డపై భారీ పీవీ విగ్రహాన్ని నిర్మించి, ఆయన శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించిందని గుర్తు చేశారు. పీవీకి భారతరత్న ఇవ్వాలని అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపి కేంద్రానికి పంపినట్టు వివరించారు. ఈ గడ్డపై పుట్టి, ఇక్కడినుంచి దేశాధినేతగా ఎదిగిన వ్యక్తి చరిత్ర తెలియని వ్యక్తులు, మన సంప్రదాయం, కట్టుబొట్టూ తెలియని వ్యక్తులు తెలంగాణను అభివృద్ధి చేస్తామని వస్తే ఎలా నమ్మాలని ప్రశ్నించారు. చైతన్యం ఉన్న తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు ద్వారా బుద్ధి చెప్పి, బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఎన్నికల వేళైనా సోనియా కుటుంబానికి పీవీ గుర్తుకొచ్చినందుకు ఆనందంగా ఉన్నదని మేయర్ ఎద్దేవా చేశారు.

## పీవీ పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదు

**పీవీ కుటుంబానికి క్షమాపణ చెప్పాలి**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పేరు ఎత్తే అర్హత కాంగ్రెస్‌కు లేదని మంత్రి కే తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పీవీ లాంటి గొప్ప నాయకుడిని ఘోరంగా అవమానించిన ఆ పార్టీ, పీవీ కుటుంబానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శనివారం ఏఎన్ఐ వార్తసంస్థతో కేటీఆర్ మాట్లాడుతూ.. ప్రధానిగా పనిచేసిన కాంగ్రెస్ నాయకుడికే పార్టీ టికెట్ కూడా ఇవ్వకుండా అవమానించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. పీవీ పార్థివదేహాన్ని ఏఐసీసీ కార్యాలయానికి రానివ్వకుండా అవమానించిన సంగతిని తెలంగాణ ప్రజలు మర్చిపోలేదని చెప్పారు. దేశ నాయకుడికి ఢిల్లీలో మెమోరియల్ కూడా నిర్మించకుండా అడ్డుకున్నది కాంగ్రెసే కాదా? అని ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం పీవీ శత జయంతిని ఘనంగా జరిపిందని, గొప్పగా గౌరవించుకున్నదని, భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి ప్రతిపాదనలు పంపించిందని గుర్తుచేశారు.



శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కెప్టెన్ లక్ష్మీకాంతారావు

# పీవీని అవమానించిన కాంగ్రెస్‌కు పుట్టగతులుండవ్

**పీవీని, ఆయన కుటుంబాన్ని గౌరవించిన ఘనత కేసీఆర్‌దే**

**రాజ్యసభ మాజీ సభ్యులు, మాజీ మంత్రి కెప్టెన్ లక్ష్మీకాంతారావు**

హుస్నాబాద్, నవంబర్ 25: భారత మాజీ ప్రధానమంత్రి, దివంగత నేత పీవీ నర్సింహారావును ఘోరంగా అవమానించిన కాంగ్రెస్ పార్టీకి అటు దేశంలోనూ, ఇటు రాష్ట్రంలోనూ పుట్టగతులుండవని రాజ్యసభ మాజీ సభ్యులు, మాజీ మంత్రి కెప్టెన్ వొడితెల లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున సుస్థిర పాలన అందించి దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించిన పీవీని.. ఆయన మరణానంతరం కాంగ్రెస్ పార్టీ ఏమాత్రమూ పట్టించుకోలేదని విమర్శించారు. కనీసం ఆయన భౌతికకాయాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ కార్యాలయానికి కూడా రానీయలేదని, ఒక అనాథ శవంలా హైదరాబాద్‌కు పంపి తీవ్రంగా అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల హుస్నాబాద్ సభకు వచ్చిన కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ పీవీ నర్సింహారావు పేరును ప్రస్తావిస్తూ.. 'పీవీ మా వాడు. ఆయన ఆశయాలను కొనసాగిస్తాం.. హుస్నాబాద్‌ను అభివృద్ధి చేస్తాం' అని చెప్పడం వారి నీతిమాలిన తనానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ పీవీ అంత్యక్రియలు ఘనంగా జరిపించకపోవడం.. ఈ ప్రాంతంతో పాటు ఇక్కడి నాయకులపై కాంగ్రెస్ ఢిల్లీ పెద్దలకున్న వివక్షను గుర్తుచేసిందని చెప్పారు. పీవీతోపాటు ఆయన కుటుంబాన్ని గౌరవించింది కేవలం సీఎం కేసీఆర్ మాత్రమేనని స్పష్టం చేశారు. పీవీ జీవిత చరిత్రను 'నమస్తే తెలంగాణ దినపత్రి'లో ప్రచురించి ప్రజలకు తెలియజేయడంతోపాటు ఆయన కుమార్తెను ఎమ్మెల్సీ చేసిన ఘనత ఆయనదేనని పేర్కొన్నారు. పీవీ స్మృతివనం, మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తున్నారని తెలిపారు.